అలజడులు సృష్టించేలా మెసేజ్ చేస్తే కఠిన చర్యలు : ఎస్పి

మాట్లాడుతున్న విద్యాసాగర్‌నాయుడు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్: కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఉద్వేశపూరితమైన సమాచారాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా షేర్ చేసినా, పోస్ట్ చేసినా ఆడియో, వీడియో మెసేజ్‌ల రూపంలో గ్రూపుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి సామాజిక మాధ్యమాల గ్రూపులను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా పోలీసులు, సైబర్ సెల్ పోలీసులతో నిఘా ఉంచామని తెలిపారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయొద్దని కోరారు. ఏదైనా మెసేజ్ ఫార్వర్డ్ చేసే ముందు వాస్తవమా కాదా అని నిర్ధారణ చేసుకున్న తర్వాతనే గ్రూప్లో షేర్ చేయాలని అలా కాకుండా ఇష్టం వచ్చినట్లు ఫార్వర్డ్ చేస్తే గ్రూప్ అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వాస్తవమైన విద్వేషపూరితమైన మెసేజ్లు ఆడియో, వీడియోలను షేర్ చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంలో ఏమాత్రం వెనకాడమని హెచ్చరించారు.

కనుమరుగవుతున్న 'పేదవాడి ఫ్రిజ్'

- మట్టి దొరకకపోవడం ఓ కారణం
- ఉపాధి కూలీలుగా మారుతున్న వైనం
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న శాలివాహనులు
- అరకొరగానే చలివేంద్రాలు ఏర్పాటు

వేసవి ఎండల తీవ్రతకు మనిషి దాహం వేసినప్పుడు సరాసరి వెళ్లేది మంచినీటి కుండవద్దకే. అందుకే మట్టికుండను పేదవాని ఫ్రిజ్ అంటారు. నేటి ఆధునిక సమాజంలో మట్టికుండ కనుమరుగైపోతుంది. ఈ వృత్తిపై ఆధారపడిన శాలివాహనుల జీవితాలు అగమ్యగోచరంగా తయారయ్యారు. వేసవి వచ్చిందంటే మట్టి కుండలకు చాలా గిరాకీ ఉండేది. శాలివాహనులు కుండలు తయారు చేసి ఆర్థికంగా కొంత బలపడేవారు. వేసవిలో సంపాదించుకున్న డబ్బులు ఏడాది పాటు వాడుకుంటూ వర్షాకాలం, చలికాలంలలో కూలీ నాలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. గతంలో పేద మధ్యతరగతి ప్రజలతో పాటు ఉన్నత వర్గాలకు చెందిన వారు కూడా మట్టి పాత్రలపై మక్కువ చూపేవారు. మార్కెట్లోకి ప్లాస్టిక్ వస్తువులు, వాటర్ క్యాన్లు, ఫ్రిజ్‌లు విరివిగా రావడంతో మట్టి కుండలు వాడకం కాలక్రమేనా తగ్గిపోతుంది.

ప్రజాశక్తి-రాయచోటి

మట్టి కుండలో ఉండే నీరు చల్లగా రుచికరంగా ఎంతో దాహాన్ని తీరుస్తాయి. నేడు మట్టి కుండలు కొనేనాధుడే కరువయ్యారు. మట్టి కుండలకు గిరాకీ ఉండే వేసవిలో కూడా అంతంతమాత్రంగా కుండలు కొనుగోలు ఉండ డంతో ఈ వృత్తిపై ఆధారపడిన ఎన్నో శాలివాహనుల జీవితాలు ఆగమ్యా గోచ రంగా మారాయి. ప్రభుత్వం ఈ వృత్తిదారులను ఆదుకోవాల్సిన అవసరం ఎం తైనా ఉంది. ప్రభుత్వం ఆధుకోకపోవడం వల్ల కులవృత్తులు నేడు కనుమ రుగవుతున్నాయి. చేతి వృత్తుల పనివారికి ప్రోత్సహించి వారి వృత్తులు కనుమరు కాకుండా చూడాల్సిన బాధ్యత ఎంతో ఉంది. లేకుంటే రాబోవు రోజుల్లో మట్టి కుండ అని బొమ్మల ద్వారా రాబోవు తరాలకు చూపించాల్సిన పరిస్థితి ఏర్పడు తుంది. కావలసిన బంకమట్టి గతంలో దొరికేది. నేడు ఉన్న మట్టిని కూడా ఎక్కడపడితే అక్కడ గృహ నిర్మాణాలకు, లేఔట్లకు తరలించడం వల్ల మట్టి కూడా కరువవుతోంది. కుమ్మరులు మట్టికుండల తయారీ కావలసిన మట్టి దొరకక పోవడంతో చేసేదిలేక నేడు చాలా మంది ఉపాధి పని కూలీలుగా మారారు.

అరకొరగానే చలివేంద్రాలు

ఎండాకాలం వచ్చిందంటే చాలా మంది ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, ప్రజలు ఎక్కువగా తిరిగే ప్రాంతాలలో మట్టికుండలతో ఉప్పు బానులతో మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రజల దాహాన్ని తీర్చుతుంటారు. గతంలో ఎక్కడపడితే అక్కడ చలివేంద్రాలు ఉండేవి. ప్రస్తుతం కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా చలివేంద్రాలను జిల్లాలో రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గం, మండల కేంద్రలలో కూడా ఏర్పాటు చేస్తున్నారు. మట్టి కుండల తయారీ గతంలో కంటే నేడు కొంత తగ్గింది. ఎందుకంటే కుండలు కొనే వారి సంఖ్య గణనీయంగా తగ్గడంతో చేసేవారు కూడా కుండలు అమ్ము పోకపోవడంతో ఈ కుండల తయారీకి ముగ్గు చూపకపోవడం గమనార్హం.

కుండలకు కొన్నిచోట్ల గిరాకీ

మట్టి కుండలకు కొన్ని చోట్ల గిరాకీ బాగుంటుంటోంది. మట్టి కుళాయి కుండ రూ.200 నుంచి 400, సాధారణ కుండ రూ.180 నుండి 500, వాటర్ బాటిల్ రూ.250, హుండీ రూ.60 నుంచి రూ.80, పూల కుండి రూ.180, చపాతీ పెనం రూ.90, వంటకు ఉపయోగపడే కుండలు రూ.120 నుండి రూ.250, మట్టి ప్రమిదలు, మూకుళ్ళు, ఇతర మట్టి సామగ్రిని అమ్ముతున్నారు. అంగళ్ళ, మైదుకూరు, ప్రొద్దుటూరు, కడప ప్రాంతాల నుంచి తెచ్చుకొని మారుబేరాలకు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. నచ్చకపోతే ఆకలి కేకలు ఉన్నట్లుగా ఈ వ్యాపారం సాగుతుందన్నారు. కొనేవారు వస్తే ఆ అమ్ముడుపోతే నాలుగు రూపాయలు ,తమకు వస్తుందని అమ్ముడుపోకపోతే ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ అమ్మకం దా ర్ల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందిని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వడదెబ్బ తగలకుండా..

వేసవి కాలంలో కాసేపు బయట తిరిగినా, వడగాలులు మన శరీరాన్ని తాకినా వడదెబ్బ తగులుతుంది. అలా జరగకూడదంటే మట్టి పాత్రల్లో నిల్వ చేసిన నీరును తాగడం మంచిది అని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.ఈ నీళ్ల శరీరంలోని గ్లూకోజ్ స్థాయుల్ని అదుపులో ఉంచి వడదెబ్బ నుంచి మనల్ని కాపాడతాయంటున్నారు. ఈ కాలంలో ప్రజలు బయటకు వెళ్లేప్పుడు ప్లాస్టిక్ బాటిల్స్ లో మంచి నీరు తీసుకెళ్లకుండా మట్టి బాటిల్స్ నీరు తీసుకెళ్తే మంచిది అని ప్లాస్టిక్లో కొన్ని విష రసాయనాలు మన శరీరానికి హాని చేస్తాయిని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

పట్టణానికి వెళ్లాలంటే భయం వేసింది

గ్రామీణ ప్రాంతాల నుండి ఏదైనా పనుల కోసం పట్టణానికి వెళ్లాలంటే ఎండలతో భయమేస్తుంది. గతంలో వాటర్ ప్యాకెట్లు అమ్మేవారు. ప్రస్తుతం వాటర్ ప్యాకెట్లను నిషేధించారు. వాటర్ బాటిల్ రూ.20 పెట్టి కొనుగోలు చేసి నీరు తాగాల్సిందే పరిస్థితి ఏర్పడింది. ఎండలు ఎక్కువగా ఉండడం వలన ఇతర ఖర్చుల కంటే నీటి తాగడానికి నీటి ఖర్చు ఎక్కువగా అవుతుంది. ప్రజలు తిరిగే ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి.

- రామకృష్ణ, సుండుపల్లి.

మట్టి పాత్రల వాడకం తగ్గింది

మట్టితో తయారు చేసిన పాత్రలు వాడకం బాగా తగ్గింది. గతంలో మట్టి కుండలకు వ్యాపారం బాగా ఉండేది. 26 సంవత్సరాలుగా మట్టి కుండల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాను. రానురాను వ్యాపారం తగ్గుముఖం పడుతుంది. రోజంతా ఇద్దరు మనుషులు వ్యాపారం చేస్తున్నాం. రోజంతా వ్యాపారం జరిగితే ఖర్చులు పోను రూ.500 నుండి 800 వరకు వస్తుంది. ప్రభుత్వం కులవృత్తి చేసే వారందరికీ ఆర్థిక సాయం అందించాలి.

- వల్లిబాషా, మట్టి కుండల వ్యాపారి, రాయచోటి.

'సుగవాసి' మృతి పార్టీకి తీరనిలోటు

- పాలకొండ్రాయుడుకు మంత్రులు జనార్ధన్‌రెడ్డి, మండిపల్లి, రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ నివాళులు

పాలకొండ్రాయుడుకు నివాళులర్పిస్తున్న మంత్రులు, రాష్ట్ర అధ్యక్షులు

ప్రజాశక్తి-రాయచోటి

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు మృతి చెందడం పార్టీకి తీరని లోటని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రోడ్డు, రవాణా శాఖ బి.సిజనార్ధన్‌రెడ్డి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని దివంగత పాలకొండ్రాయుడు భౌతికకాయానికి వారు పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ సుగవాసి పాలకొండ్రాయుడు మృతి చెందడంతో రాష్ట్రం ఒక గొప్ప నాయకున్ని కోల్పోయిందన్నారు. వారి మరణం రాష్ట్రానికి టిడిపికి తీరని లోటని సుగువాసి పాలకొండ్రాయుడు నాలుగు శతాబ్దాలుగా తన రాజకీయ జీవితం ప్రజలకు అంకితం చేసి ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన ఒక గొప్ప వ్యక్తిని పేర్కొన్నారు. ఆయన మరణం చాలా బాధాకరమని వారి కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ సుగవాసి పాలకొండ్రాయుడు ఎంపీగా ఎమ్మెల్యేగా పార్టీకి అనేక సేవా కార్యక్రమాలు చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు పాలకొండ్రాయుడు భౌతిక కాయాన్ని సందర్శించి ఘన నివాళులర్పించామని పేర్కొన్నారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సుగవాసి పాలకొండ్రాయుడు మరణం రాష్ట్రానికే కాదు టిడిపికి తీరని లోటన్నారు. సుగువాసి పాల కొండ్రాయుడు గతంలో బిసిల సంక్షేమం కోసం ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఇంకా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామ చంద్రారెడ్డి, గడి కోట శ్రీకాంత్‌రెడ్డి, విజయమ్మ, కాంగ్రెస్ పార్టీ పిసిఇస మీడియా చైర్మన్ ఎన్.తులసి రెడ్డి, టిడిపి నాయకులు గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాష,మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు పార్థివ దేహాన్ని సందర్శించి సంతాపం తెలిపి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నేడు అంత్యక్రియలు.. పాలకొండరాయుడు అంతిమయాత్ర గురువారం ఉదయం 9:00 గంటలకు రాయచోటి పట్టణంలోని ప్రీతం రెసిడెన్సీ నుండి బస్టాండ్, బంగ్లా, ఠాణా, మాసాపేట మీదుగా వరిగ రోడ్డు గుండా మునె ప్పగారిపల్లి, బుగ్గ, పాత రాయచోటి మీదుగా అంతిమయాత్ర జరిగి గౌతమ్ హాల్ దగ్గర అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు

ప్రజానాయకుడు పాలకొండ్రాయుడు

ప్రజానాయకుడు సుగవాసి పాలకొండ్రాయుడు అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం పాలకొండ్రాయుడు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన కుమారులు సుగవాసి బాల సుబ్రమణ్యం, సుగవాసి ప్రసాద్ బాబును పరామర్శి ంచారు. పాలకొండ్రాయుడు రాజకీయ జీవితంలో ప్రత్యేక ముద్ర వేసుకున్నారని శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రాధాన్యత : కలెక్టర్

విభిన్న ప్రతిభావంతులకు ఆధునిక కృత్రిమ కాళ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, వారి అభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తోందని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పబ్లిక్ ప్రయివేట్ భాగస్వామ్యంలో చెన్నై యాక్సెస్ హెల్త్ కేర్ ఫ్రీడం ట్రస్ట్ వారి సహకారంతో 150 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.50 లక్షల విలువైన కృత్రిమ కాళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న కలెక్టర్, జెసి ఆదర్శ్ రాజేంద్రన్ విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ కాళ్ళను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ తోడ్పాటును అందిపుచ్చుకొని విభిన్న ప్రతిభావంతులు అభివృద్ధి చెందాలన్నారు. జిల్లాలోని 150 మంది కాళ్లు కోల్పోయిన విభిన్న ప్రతిభావంతులకు సంబంధించి ఈ ఏడాది మార్చి మొదటి వారంలో కృత్రిమ కాళ్ళ కొరకు కొలతలు తీసుకోవడం జరిగిందన్నారు. అతి తక్కువ కాలంలోనే వీరందరికీ చెన్నైకి చెందిన యాక్సిస్ హెల్త్ కేర్ ఫ్రీడం ట్రస్ట్ ఆర్థిక సహకారంతో నేడు రూ.50 లక్షలు విలువైన ఆధునిక కృత్రిమ కాళ్ళు అమర్చడం జరిగిందన్నారు. మన జిల్లా వారు ఇంత మంది లబ్ధి పొందడం ఎంతో సంతోషకరం. వీరి జీవితాల్లో మార్పు తీసుకురావడం గొప్ప విషయం' అన్నారు. ఇందుకు కృషి చేసిన విభిన్న ప్రతిభావంతుల శాఖ, చెన్నై యాక్సెస్ హెల్త్ కేర్ ఫ్రీడం ట్రస్ట్ ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్ మాట్లాడుతూ ఈ సేవా కార్యక్రమం నిరాడంబరంగా ఎంతో ప్రభావవంతంగా జరిగిందన్నారు. ఇదే స్ఫూర్తి, సహకా రంతో భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు జరగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో చెన్నై యాక్సెస్ హెల్త్ కేర్ ఫ్రీడం ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ సుందర్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ తరపున ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉండటం గర్వంగా ఉందన్నారు. మరిన్ని సహాయ కార్యక్రమాలకు తాము సిద్ధంగా ఉన్నాం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఆర్.వి.కృష్ణ కిషోర్, వారి సిబ్బంది, చెన్నై యాక్సెస్ హెల్త్ కేర్ ఫ్రీడం ట్రస్ట్ ప్రతినిధులు, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉషశ్రీ

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉషశ్రీ

ప్రజాశక్తి-రాయచోటి: జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా ఆపాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని, చేసిన వారు, చేయించుకున్న వారు, ప్రోత్సహించిన వారు చట్ట ప్రకారం శిక్షార్హులని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉషశ్రీ తెలిపారు. బుధవారం స్థానిక డిఎంహెచ్ఒ కార్యాలయంలోని తన ఛాంబర్లో డిఎంహెచ్ఒ అధ్యక్షతన జిల్లా అడ్వైజరి కమిటీ పిసిపిఎన్‌డిటి ఆక్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఆడపిల్లల నిష్పత్తిని మెరుగుపరచడానికి పిసిపిఎన్‌డిటి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఇందుకు సంబంధించి అన్ని శాఖల వారు సహాయ సహకారాలను అందించాలని కోరారు. నిబంధనలు అతిక్రమించిన ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ డెమో దేవసిరోమని మాట్లాడుతూ లింగ నిర్ధారణ నిషేధ చట్టం, భేటీ బచావో బేటి పడావో, సేవ్ ద గర్ల్ చైల్డ్ మొదలగు కార్యక్రమాలపై వైద్య సిబ్బందితోపాటు 'స్వచ్ఛంద సంస్థలు' కూడా అవగాహన కార్యక్రమాలను ఎక్కువగా నిర్వహించాలని కోరారు. లింగ నిర్ధారణ చేసే ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లను కనిపెట్టేందుకు చేపట్టే డెకాయ్ ఆపరేషన్లు నిర్వహణకు పోలీస్ శాఖ, స్వఛ్ఛేద సంస్థల సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శైలజ, రియాజ్ బేగ్, డాక్టర్ విష్ణు, డాక్టర్ శివప్రతాప్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్, సిఐ మల్లయ్య, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వినోద్, లీగల్ ఎక్స్పర్ట్ నాగేశ్వరరావు, స్వఛ్ఛేద సంస్థల ప్రతినిధులు నాగేశ్వరరావు, చెన్నారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్లు బలరామరాజు, ఉష, సుగుణ, సిహెచ్ఒ నారాయణ పాల్గొన్నారు.

డ్రాయింగ్ విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గిస్తుంది : జెవివి

ప్రజాశక్తి-రాయచోటి : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు డ్రాయింగ్, పెయింటింగ్‌లలో మెలుకువలు నేర్పించినట్లు జనవిజ్ఞాన వేదిక నాయకులు ప్రకాష్ రెడ్డి తెలిపారు. చిత్రకళా నిపుణులు గోపాల్ దాస్ రాజశేఖర్ మాట్లాడుతూ డ్రాయింగ్, పెయింటింగ్ విద్యార్థులలో ఒత్తిడిని తగ్గించి జ్ఞాపకశక్తిని పెంపొందిస్తుందని తెలిపారు. సృజనాత్మకతను పెంపొందించి, భావోద్వేగాల నియంత్రణ ను మెరుగు పరుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో శివ, రామయ్య, రాజశేఖర్, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పిల్లలతో డ్రాయింగ్ వేయిస్తున్న ఉపాధ్యాయుడు

నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన మహనీయుడు 'అల్లూరి'

-ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి యుద్ధ తంత్రకళను ఉపయోగించి బ్రిటిష్ సైన్యానికి ముచ్చెమటలు పట్టించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు1897 జులై 4న విశాఖపట్నం జిల్లా పాండ్రంగిలో జన్మించారని అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్లు పెరిగి 9వ తరగతి వరకు చదువుకున్నారని అన్నారు. సాంస్కృతం, జ్యోతిష్యం, జాతక శాస్త్రం, విలువిద్య, గుర్రపు స్వారీలో ప్రావీణ్యం పొందారని అన్నారు. మన్యం ప్రజల దినస్థితిగతులను పరిశీలించి బ్రిటిష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా విప్లవానికి సిద్ధం కావాలని మన్యం ప్రజలను కురిగొల్పారన్నారు. గెరిల్లా యుద్ధ తంత్రాలను ఉపయోగించి బ్రిటిష్ సైన్యానికి ముచ్చెమటలు పట్టించారని అన్నారు. భారత స్వాతంత్రం కోసం పోరాడిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్రం కోసం పోరాడి 20 ఏళ్ల చిన్నవయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి అల్లూరి అని కొనియాడారు. తనను నమ్ముకున్న ప్రజల కోసం ప్రాణ త్యాగం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎఎస్‌పి ఎం వెంకటాద్రి, ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసులు, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ శంకర మల్లయ్య, స్పెషల్ బ్రాంచ్ సిఐ పి.రాజారమేష్, కె.రాజారెడ్డి, టాస్క్‌ఫోర్స్ సిఐ రాఘవరెడ్డి, రిజ ర్వుడ్ ఎస్ఐ ఎం.పెద్దయ్య, పోలీసు అధికారులు, మహిళా పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్‌పి

పీలేరులో జోరు వాన

- వీధులు, రోడ్లు జలమయం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో నీటితో నిండిన ప్రధాన రహదారి

ఎండ, ఉక్కపోతలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. నల్లని మేఘాలు కమ్ముకుని, గాలి ఓవైపు వీస్తూ, ఉరుములు, మెరుపులతో జోరున వాన మరోవైపు కురిసింది. ఉక్కపోతతో అల్లాడిన జనానికి ఈ వాన కాస్త సేద తీర్చినప్పటికీ, మామిడి రైతులను మాత్రం నష్టానికి గురిచేసింది. బుధవారం సాయంత్రం మొదలైన ఈ వర్షం ఆగకుండా రాత్రి 7 గంటలు దాటాక కూడా కురవసాగింది. సాయంత్రం 6 గంటలకే 38 మిల్లీలీటర్ల వర్షపాతం నమోదైంది. పీలేరు పట్టణంలోని మురుగునీటి కాలువలు చెత్తా, చెదారం, వర్షపు నీటితో నిండి పొంగిపొర్లాయి. రహదారులతో పాటు ఆర్టీసీ బస్టాండు కూడా జలమయమైంది. పట్టణంలో చేపట్టిన ఆర్‌ఓబిల నిర్మాణం పనులలో భాగంగా అయ్యప్ప నాయుని చెరువు సప్లై ఛానల్ నిర్మాణానికి ఇరువైపులా నీరు నిండుకోవడం, అలాగే మదనపల్లి మార్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ఆర్టీసీ బస్టాండు సమీపం వరకు కూడా ఈ నిర్మాణం పనులతో రోడ్లు బురదమయం అయ్యాయి. అదేవిధంగా చిత్తూరు రోడ్డులో నాలుగు రోడ్ల కూడలి నుంచి మోడల్ కాలనీ వరకు కూడా రోడ్లు బురద నిండుకున్న ఫలితంగా వాహనాలు, పాదచారుల రాకపోకలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. బస్టాండ్ ప్రాంతంలో ప్లాట్ఫారం వరకు నీరు నిండుకోవడంతో దుకాణాల సముదాయంలోకి వర్షపు నీరు ఎక్కడ చేరుతుందోనన్న భయంతో వ్యాపారులు బిక్కు బిక్కు మంటూ గడపాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

డివైఇఒగా లోకేశ్వర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె డివైఇఒగా లోకేశ్వర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పీలేరు ఎంఇఒగా లోకేశ్వర్‌రెడ్డి, మదనపల్లె డివైఇఒగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా మదనపల్లె పట్టణంలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యావిధానాన్ని బలోపేతం చేసేందుకు పని చేస్తానని తెలిపారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొనిపోయి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే విద్యార్థులకు న్యాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తానన్నారు.

డిప్యూటీ డిఇఒను కలిసిన యుటిఎఫ్ నాయకులు

మదనపల్లి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారిగా నియమితులైన వై.లోకేశ్వర్ రెడ్డిని బుధవారం యుటిఎఫ్ నాయకులు కలిసి పుష్ప గుచ్ఛం అందించి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు టి.సుధాకర్ నాయుడు, జిల్లా కార్యదర్శులు పురం వెంకటరమణ, ఆదినారాయణ, విజయ్ కుమార్, నాయకులు అంజాద్, గంగులప్ప, శ్రీధర్, మురళి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

లోకేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు

రాష్ట్ర విద్య, వైజ్ఞానిక తరగతుల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

17 నుంచి విద్య, వైజ్ఞానిక శిక్షణా తరగతులు

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణంలో ఈ నెల 17వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర విద్యా వైజ్ఞానిక తరగతులను జయప్రదం చేయాలనిరాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా అధ్యక్షులు నరసింహ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక శిక్షణా తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల పక్షాన అను నిత్యం పోరాడుతూ, విద్యార్థులను చైతన్యం చేసి స్వాతంత్రం సమరయోధుల స్ఫూర్తితో ఎస్ఎఫ్ఐ అగ్ర భాగాన ఉందన్నారు. ఈ శిక్షణ తరగతులకు రాష్ట్ర నలుమూలల నుండి 300 మందికి పైగా ప్రతినిధులు హాజరు కానున్నారని, విద్యారంగ పరిరక్షణ కోసం ఉపాధి అవకాశాల కోసం భవిష్యత్తులో ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. విద్య కార్పొరేటికరణకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ అనునిత్యం పోరాడుతుందని స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షుడు నరసింహ మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులను నిర్వహించేందుకు రాష్ట్ర నాయకత్వం మదనపల్లెకి అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ శిక్షణ తరగతులు జయప్రదానికి ప్రముఖులు, మేధావులు, విద్యావేత్తలు, ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పది రోజులు పాటు జరుగుతున్న క్లాసులకు మీ వంతు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కరపత్రాల ఆవిష్కరణలో జిల్లా ఉపాధ్యక్షుడు మదన్ మోహన్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జయ బాబు, ప్రేమ్ పాల్గొన్నారు

ఏకగ్రీవంగా వాల్మీకి జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వాల్మీకి జిల్లా నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వాల్మీకి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉత్తరాసి హరికృష్ణ, ఉపాధ్యక్షులు చిన్నరాయప్ప ఆధ్వర్యంలోజిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవపట్ల సుధాకర్, ఉపాధ్యక్షుడిగా విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా యనమల నవీన్ ఎంపికయ్యారు. మదనపల్లి గ్రామీణ మండలాలలో ఉన్న వాల్మీకి సోదరుల సంక్షేమమే ధ్యేయంగా జిల్లా నూతన కమిటీ పనిచేస్తుందని రాష్ట్ర వాల్మీకి కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉత్తరాసి హరికృష్ణ, గౌరవ ఉపాధ్యక్షుడు చిన్నరాయప్ప, మిద్దింటి రవికిరణ్, రాగి మేకల పల్లి శ్రీనివాసులు, రాష్ట్ర అధికార ప్రతినిధి బొగ్గిటి కృష్ణమూర్తి, నిమ్మనపల్లి హరి, మణి, నవీన్ పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన వాల్మీకి జిల్లా కమిటీ సభ్యులు

బాధితుడికి చెక్కును అందిస్తున్న వరలక్ష్మీ

కేన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రం పుల్లంపేటలో నివాసం ఉంటున్న పట్టుపోగుల చక్రపాణి గత కొన్ని రోజులుగా గొంతు కేన్సర్‌తో వేలూరు లోని సిఎంసిలో చికిత్స పొందు తు న్నాడు. నిరుపేదలైన చక్రపాణి కుటుంబం రూ.30లక్షల ఖర్చు పెట్టి వైద్యం చేయి ంచ లేక ఇబ్బందులు పడుతున్నారు. బాధితుడి బంధువులు ముక్కారూపానంద రెడ్డి దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన ఆయన రూ.50వేలు ఆర్థిక సాయం అందించారు. బుధవారం రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మీ బాధితులకు ఆర్థిక సాయా న్ని అందజేశారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితులు బాగోగులు తెలుసుకొని వెంటనే ఎన్టీ ఆర్ బసవతారకం కేన్సర్ ఆస్పత్రికి లెటర్ ఇచ్చి పంపించారు. సాయం అందించిన చేసి న ముక్కా రూపనంద్‌రెడ్డికి, ఆయన సతీమణి వరలక్ష్మికి కుమారులు విశాల్‌రెడ్డి, వికాస్ రెడ్డికి వారి కుటుంబ సభ్యులకు చక్రపాణి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

తిరుణాలకు మంత్రికి ఆహ్వానం

ప్రజాశక్తి-రాయచోటి

స్థానిక పట్టణంలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని బుధవారం సంబేపల్లి మండలం, నారాయణ రెడ్డిపల్లె ప్రజలు కలిశారు. గ్రామంలో జరిగే మంచాలమ్మ తిరుణాలకు హాజరు కావాలని కోరినట్లు తెలిపారు. తిరుణాలకు మంత్రి తప్పక హజరవుతానని చెప్పారని పేర్కొన్నారు.

గడ్డిలోడుతో వెళుతున్న ట్రాక్టర్‌లో మంటలు

-తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రం సుండుపల్లిలోని మూడు రోడ్ల సమీపంలో బుధవారం తిమ్మసముద్రం నుంచి సుండుపల్లెకు మీదుగా రాయచోటికి గడ్డివాము లోడు వెళుతున్న ట్రాక్టర్ విద్యుత్ వైర్లు తగులుకొని మంటలు చెలరే గాయి. గమనించిన స్థానిక ప్రజలు డ్రైవర్‌ను అప్రమత్తం చేసి అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందించారు. అనంతరం సమీపంలోని వాటర్ సర్వీస్ వద్ద ఉన్న నీటితో మంటల అదుపు తెచ్చే ప్రయత్నం చేశారు. రాయచోటి నుంచి ఫైర్ ఇంజిన్ వచ్చే లోపే స్థానిక ప్రజలు మంటలను పూర్తిగా అదుపు చేశారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ డ్రైవర్ మాట్లాడుతూ ఈ ప్రమాదంతో ట్రాక్టర్ కు ఏమి కాలేదని, పదివేల రూపాయలు విలువ చేసే పశుగ్రాసం కాలిపోయిందని తెలి పారు. స్థానిక ప్రజలు అప్రమత్తం చేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు.

ఘనంగా శ్రీవాసవిమాత జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శ్రీ వాసవి మాత జన్మదిన వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్ కు, ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకము నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో కొలువు తీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను అందజేశారు.అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి కేక్ ఏర్పాటు చేసి వేలంపాట నిర్వహించారు. రాజంపేటకు చెందిన ఎంబలూరు లక్ష్మీనారాయణ, అమృతమ్మలు రూ.1.16 లక్షలు విలువగల బంగారు ఆభరణాన్ని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవికి వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఎంబలూరు నరసింహారావు, ఆలయ అధ్యక్షులు ఎంబలూరు నరసింహస్వామి, ఉపాధ్యక్షులు మాకం వెంకట కుమార్, సెక్రటరీ గెలివి కుమార్, మేడ వెంకట కుమార్, మంచికంటి నారాయణ, ఎంబలూరు బాబు, ఎంబలూరు అనిల్ కుమార్, మహిళా మండలి అధ్యక్ష, ఉపాధ్యక్షురాలు గెలివి జయలక్ష్మి, చలపాటి మాధవి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సౌమ్యనాథస్వామి హుండీ ఆదాయం రూ.2.64 లక్షలు

ప్రజాశక్తి-నందలూరు

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి హుండిని బుధవారం లెక్కించగా రూ.2,64,921లు వచ్చినట్లు ఆలయ ఇన్స్‌పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీని నెలరోజుల తర్వాత లెక్కించడం జరిగిందని అన్నారు. వచ్చిన మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. హుండి లెక్కింపులో ఆలయ సూపరిండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి జనార్ధన, భక్తులు పాల్గొన్నారు.

మైనార్టీ సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె : రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనారిటీలకు స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలను ప్రభుత్వం అందిస్తోందని ఆసక్తి అర్హత కలిగిన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మైనారిటీలకు స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. మైనారిటీలకు రూ.5లక్షల వరకు రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మండలానికి 24 యూనిట్లు మంజూరు కాగా ఇండియన్ బ్యాంక్ పరిధిలో రూ.లక్షల లోపు 8యూనిట్లు, రూ.3లక్షలు 2, రూ.5 లక్షలు1, నిమ్మనపల్లి సప్తగిరి గ్రామీణ బ్యాంకు పరిధిలో రూ.లక్షల లోపు 8 యూనిట్లు, రూ.3 లక్షలు 1, రూ.5 లక్షలు 1, మదనపల్లి సప్తగిరి గ్రామీణ బ్యాంకు పరిధిలో రూ.లక్షల లోపు 2 యూనిట్లు, రూ.3లక్షలు 1 యూనిట్‌ను కేటాయించడం జరిగిందన్నారు. ఎంపికైన వారికి 50 శాతం సబ్సిడీతో రుణం మంజూరవుతుందన్నారు. 21ఏళ్ల నుంచి 55 ఏళ్ల లోపు వయసు కలిగి ఆసక్తి ఉన్న మైనార్టీలు ఎపిఒబి ఎంఎంఎస్.ఎపిసిఎఫ్ఎస్ వెబ్‌సైట్‌లో ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన ఫారాలను ఎంపిడిఒ కార్యాలయంలో మూడు సెట్లును అందించాలని తెలిపారు. ఆసక్తి కలిగిన మైనార్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ తెలిపారు.

నిందితులను పట్టిస్తే రూ.లక్ష బహుమానం

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని తూముకుంట గ్రామంలో వెలిసిన సోలార్ పార్క్ వస్తువులు అపహరణకు గురవుతున్నాయని, దొంగిలించే వారిని పట్టించినా, సమాచారం అందించిన స్టార్ యుటెక్స్ మేనేజ్మెంట్ సెక్యూరిటీ అండ్ సర్వీస్ తరపున లక్ష రూపాయల నగదు బహుమతి అందిస్తామని సోలార్ సిబ్బంది భాస్కర్, రవీంద్రబాబు, గ్రామాలలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఇటీవల సోలార్‌లో వస్తువులు అపహరణకు గురవుత ున్నాయని వాటి ప్రభావం వల్ల ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని అన్నారు. పవర్ ప్లాంట్ ద్వారా గ్రామాలలో ఉద్యోగ అవకాశాలు పొందుతున్న యువకుల కూడా దెబ్బతిన్న అవకాశాలు ఉన్నాయని వాటి దృష్టిలో పెట్టుకొని గ్రామాలలో ఎక్కడైనా ఈ సమాచారం దొరికితే సమాచారం అందివ్వగలరని పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి-ములకలచెరువు : మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ హరి నారాయణ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లో నీటి తీవ్రత ఎక్కువగా ఉందని సమస్య ఏర్పడకుండా ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. నీటి సౌకర్యం లేనిచోట రైతుల ప్రయివేట్ బోర్ల నుంచి టైఅప్, లేదా ట్యాంకర్లతో నీటి సరఫరాకు స్థానిక ప్రజా ప్రతినిధులు సహకారంతో తాగునీటి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చక్రపాణి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

దళితవాడల్లో అడ్డుగోడలపై ఎస్‌పి విచారణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

దళితువాడల చుట్టూ అగ్రవర్ణాల వారు నిర్మించిన ఎత్తయిన అడ్డుగోడల నిర్మాణాలపై బుధవారం ఎఎస్‌పి మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే విచారణ చేపట్టారు. కూచివారిపల్లె గ్రామపంచాయతీలోని డిబిఎన్‌పల్లె దళితవాడ, ఊటుకూరు గ్రామపంచాయతీ పరిధిలోని డిబిఎన్‌పల్లె దళితవాడ గ్రామాల ప్రజలు గత నెల 21న అడ్డుగోడలపై సబ్ కలెక్టర్ వైఖోమ్‌నదియాదేవికి ఫిర్యాదు చేశారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఎఎస్‌పి డిబిఎన్‌పల్లెలోని ఎగువ దళితవాడ, దిగువ దళితవాడల్లో పర్యటించి ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల ప్రజలు మాట్లాడుతూ అగ్రవర్ణాల వారు తమ గ్రామాల చుట్టూ ఎత్తైన అడ్డుగోడలు నిర్మించి తమను సామాజిక బహిష్కరణకు గురి చేశారని అన్నారు. అంటరానితనంతో కుల వివక్షకు పాల్పడిన అగ్రవర్ణాల వారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేసి తమ అభివృద్ధికి, ఆత్మగౌరవానికి అడ్డుగా నిలిచిన అడ్డుగోడలను తొలగించాలని ఎఎస్‌పికి తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి వారి సూచనలు మేరకు తగు చర్యలు తీసుకుంటామని ఎఎస్‌పి పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ సిఐ రాజా, ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, పోలీసు సిబ్బంది, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు వెలగచర్ల శివయ్య, జిల్లా నాయకులు చేమూరి వెంకటేష్, దళితవాడ ప్రజలు పాల్గొన్నారు.

గ్రామంలో విచారణ చేపడుతున్న ఎఎస్‌పి మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే

'మిట్స్'లో ఘనంగా మెకోనన్స్ 2కె25

బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న రామ్‌ప్రభు

ప్రజాశక్తి-మదనపల్లె

అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం వారు జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం మెకొనన్స్-2కె25ను ఘనంగా జరుపుకున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెంగళూరు లోని డిఆర్‌డిఒ సైంటిస్ట్ డాక్టర్ రామ్ ప్రభు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానికల్ ఇంజినీరింగ్ ఎవర్ గ్రీన్ అని, కోర్ జాబ్స్ చేసే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ మెకానికల్ ఇంజినీర్లకు అపారమైన అవకాశాలను కల్పిస్తోంది. ఇది భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన ప్రముఖ పరిశోధనా సంస్థగా దేశ రక్షణ రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. డిఆర్‌డిఒలో మెకానికల్ ఇంజినీర్లకు సైంటిస్ట్ 'బి' పోస్టులు, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, ఇంటర్న్‌షిప్, ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లు, టెక్నికల్ పోస్టులలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వంటి అనేక అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ పోస్టులకు అర్హతగా బిఇ, బిటెక్ (మెకానికల్ ఇంజినీరింగ్) ఉత్తీర్ణత అవసరం కాగా, సైంటిస్ట్, రీసెర్చ్ సంబంధిత ఉద్యోగాలకు గేట్ స్కోర్ చాలా ముఖ్యమని, కొన్నిచోట్ల మాస్టర్స్ డిగ్రీ కూడా ప్రాధాన్యత కలిగి ఉంటుందన్నారు. డిఆర్‌డిఒలో ఉద్యోగాలు పొందేందుక అధికారిక వెబ్‌సైట్ https://www.drdo.gov.in లేదా రిక్రూట్‌మెంట్ అండ్ అసెస్మెంట్ సెంటర్ వెబ్‌సైట్ (https://rac.gov.in) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ మాట్లాడుతూ ఈ జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియంకు దేశ నలుమూలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు టెక్నికల్ పేపర్ ప్రెజెం టేషన్, క్విజ్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఆటో క్యాడ్ డ్రాయింగ్, ఈవెంట్ లలో పాల్గొనడానికి వచ్చారని అన్నారు. విభాగాధిపతి డాక్టర్ ఎస్ భాస్కరన్, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ డాక్టర్ వీరేశలింగం మాట్లాడుతూ ఈ కార్యక్రమం ని నిర్వహించడానికి ప్రోత్సహించిన కళాశాల కరెస్పాం డంట్ డాక్టర్ ఎన్.విజ యభాస్కర్‌చౌదరికి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్లకు కృతజ్ఞతలు తెలిపారు.

యుద్ధం వస్తే మనల్ని మనం రక్షించుకోవాలి

ప్రజాశక్తి-గాలివీడు

పాకిస్తాన్‌తో యుద్ధం సంభవిస్తే మనల్ని మనం రక్షించుకోగలుగుతూ ఇతరులను కూడా రక్షించుకునే స్థాయికి ప్రతి ఒక్క భారతీయ పౌరుడు ఎదగాలని చైతన్యవంతులుగా ఉండాలని ఆర్‌డిఒ ఎస్.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం తూముకుంట గ్రామం సోలార్ వద్ద ప్రజలతో సోలార్‌లో పనిచేస్తున్న యువకులతో కలిసిమాక్ డ్రిల్ నిర్వహించారు. యుద్ధం సంభవిస్తే ప్రమాదం జరిగితే వచ్చే అనర్థాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వాటిపైన నివృత్తి చేశారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి సిఐ సివి. కొండారెడ్డి, ఎస్‌బిఐ ఇన్స్‌పెక్టర్ రాజారెడ్డి , ఫైర్ ఇన్స్ట్రక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లి ఇన్స్‌పెక్టర్ రవి, ఎస్ ఐ.పి .రామకృష్ణ, తహశీల్దార్ జె .బాగ్యలత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

క్యారంబోర్డు ఆడుతున్న చిన్నారులు

ఆటపాటలతో వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక గ్రంథాలయంలో పిల్లలకు ఆటపాటలతో వేసవి విజ్ఞాన శిబిరంలో చదువు కొనసాగుతున్నట్లు గ్రంథాలయ అధికారి జిలాని బాషా తెలిపారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరానికి పిల్లల నుంచి మంచి స్పంద న వస్తుందన్నారు. ఈ శిబిరానికి హాజరయ్యేందుకు పిల్లల్లో ఆసక్తి పెరిగి రోజు వస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఈ కార్య క్రమం కొనసాగుతుందన్నారు. పిల్లలు దినపత్రికలు, కథల పుస్తకాలు చద వడం, కథలు చెప్పడం, క్యారం బోర్డ్, చెస్ ఆడిపించడం జరుగుతుం దన్నా రు. రోజు 20 మంది పిల్లలకు పైగా క్రమం తప్పకుండా హాజరవుతున్నారు.

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత

ప్రజాశక్తి-పుల్లంపేట

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న శ్రీనివాసులరెడ్డి

మన ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీని వాసులరెడ్డి అన్నారు. బుధవారం ఆయన పుల్లంపేట పంచాయతీలోని పురవీధుల్లో పారిశుధ్య కార్యక్ర మాలను చేపట్టారు.గ్రామంలో భావనాఋషిస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నందున వీధుల్లో చెత్త తొలగించి బ్లీచింగ్ సున్నం చలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటి చెత్తను అప్పుడే తొలగించు కోవాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు పెరగకుండా తద్వారా అంటు వ్యాధులు ప్రబలకుండా మనం మన ఆరో గ్యాన్ని కాపాడుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ముత్తయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ్రాయుడుకు ఘన నివాళి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బడుగు, బలహీన వర్గాల పక్షపాతి మాజీ ఎంపీ, రాయచోటి మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు కువైట్ ఎన్ఆర్ఐ టిడిపి యువ నాయకులు కంచనరెడ్డి శేఖర్ అన్నారు. బుధవారం కువైట్‌లోని హవల్లిలో పాలకొండ్రాయుడు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళు లర్పించారు. 40 సంవత్సరాల రాజకీయ ప్రస్థానంలో ఓటమి ఎరగని మహోన్నత నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో సహదేవ, నాగేష్, సాయిబాబా, బలిజపల్లి సేవ సంఘం అధ్యక్షులు రాజా, కొండమ్రి శ్రీహరి నాయుడు, గోళ్ల గురుమూర్తి నాయుడు, నాగరాజ, మల్లిఖార్జున, బలరాం, మధు సూదన్, సైద్ వసి, సుబ్బ రాయుడు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** సుగవాసి పాలకొండ రాయుడు తనదైన ముద్ర వేశారని మదనపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ అన్నారు. రాయచోటిలో పాలకొండ రాయుడి పార్థివదేహానికి కాంగ్రెస్ నాయకులు ఎన్.తులసిరెడ్డి, పిసిసి జనరల్ సెక్రటరీ షేక్ అల్లా బకాష్, ఎస్.ఎం.డి గౌస్, డిసిసి మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ అలీ, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు మహమ్మద్ రఫీ, మహబూబ్ బాషా, జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నకృష్ణ, ఖదీర్, జిల్లా సెక్రెటరీ మహ్మద్ అలీ, మదనపల్లి పట్టణ మైనార్టీ అధ్యక్షుడు షేక్ మహబూబ్ పీర్, మహమ్మద్ అలీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

'ఆపరేషన్ సిందూర్' గర్వకారణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని,భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ దేశానికే గర్వకారణమని మదనపల్లి వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని రూపుమాపే విధంగా లష్కర్ ఏ తోయిబా ప్రధాన కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం దేశానికి గర్వకారణమన్నారు. ముష్కరుల చర్యలకు ఇది తగిన గుణపాఠం అని అన్నారు. దేశ ప్రజలు, ప్రపంచంలోని మెజార్టీ దేశాలు భారత్ నిర్ణయం వెంట మద్దతుగా నిలిచాయన్నారు.

హరికథ కాలక్షేపం ప్రదర్శిస్తున్న కళాకారులు

మహాభారత యజ్ఞం ప్రారంభం

ప్రజాశక్తి-కలకడ

మహాభారత యజ్ఞాన్ని ప్రారంభించినట్లు మాజీ ఎంపిపీ శ్యామల కాంతారావు తెలిపారు.మండలంలోని కోన పంచాయితీ తిప్పిగారి పల్లెలో ఈనెల 4 నుంచి 18వ తేదీ వరకు మహాభారత నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం మహాభారత యుద్ధంలో భాగంగా బలివండి సన్నివేశం ప్రదర్శించినట్లు తెలిపారు. పగలు హరికథ కాలక్షేపం, రాత్రి వేళలో వీధి నాటకాలు ఉంటాయని ఆయన తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని చూసి ఆనందించాలని ఆయన కోరారు.

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : మండలంలో కొత్త రేషన్ కార్డుల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ పీర్ మున్నీసా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్డుల విభజన, చిరునామా మార్పు, సభ్యుల నమోదు, సభ్యుల తొలగింపు, రేషన్ కార్డుల సరెండర్ చేయడం, రేషన్ కార్డులలో చిరునామా మార్పు చేయనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో రైతులకు పండ్ల తోటలు, పూల తోటల పెంపకాలపై అవగాహన కల్పించాలని ఎపిఒ అంజనప్ప ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్త్రీశక్తి భవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారి జరుగుతున్న ఉపాధి పనులు బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు పండ్ల తోటల పెంపకంతో కలిగే లాభాలను వివరించి ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటల పెంపకాన్ని చేపట్టే విధంగా ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్లు కృషి చేయాలని సూచించారు. రైతులను పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి కలిగిన రైతులను గుర్తించి వారికి ఉపాధి హామీ ద్వారా లబ్ధి చేకూర్చాలన్నారు. ఈ సమావేశంలో మండల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిఒ అంజనప్ప

ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధిస్తున్న సిఐ

ట్రాఫిక్ నిర్మూలనకు ప్రజలు సహకరించాలి : సిఐ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలో ట్రాఫిక్ నిర్మూలనకు ప్రజలు,వాహనదారులు సహకరించాలని బి.కొత్తకోట సిఐ జీవన్ గంగానాథ్‌బాబు సూచించారు. బుధవారం జ్యోతి చౌక్‌లో షాపులకి ఇరువైపులా ద్విచక్ర వాహనాలు నిలిపి ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న ద్విచక్ర వాహనదారులకు జరిమానాలు విధించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాలకు వెళ్లే ప్రజలు రోడ్డుపైన వాహనాలు పార్కింగ్ చేయరాదన్నారు. దుకాణదారులు పార్కింగ్‌కి కేటాయించిన స్థలంలోనే వాహనాలు నిలపాలని సూచించారు. ఇప్పటికే పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు పెరుగుతోందన్నారు.వాహనదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, విచ్చలవిడిగా వాహనాలు పార్కింగ్ చేస్తే జరిమానా తప్పదన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో 'మిట్స్' విద్యార్థి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వెంకటరమణ(ఫైల్ ఫొటో)

రోడ్డు ప్రమాదంలో మిట్స్ కళాశాలలో చదువుకున్న ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దమండ్యం మండలం, కలిచర్ల గ్రామం, శెట్టివారిపల్లికి చెందిన వెంకటేష్ కుమారుడు జి.వెంకటరమణ (22) మిట్స్ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ముగ్గు రు స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంలో కాలేజీకి బయల్దేరాడు. మార్గ మధ్యంలోని అంగళ్లు సమీపంలో ఎదురుగా వచ్చిన మరో బైకు ఢీకొనడంతో వెంకటరమణ, శశిధర్ రోడ్డుపైన పడిపోయారు. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న ట్రాక్టర్ వెంకటరమణ పై దూసుకెళ్లింది. వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మరో విద్యార్థి శశిధర్‌ను వెంటనే కురబల కోట 108 సిబ్బంది భావజాన్, మస్తాన్ మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఒంటరితనాన్ని భరించలేని ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ సంఘటన బుధవారం మదనపల్లె పట్టణ శివార్లలో చోటుచేసుకుంది. బాధితురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. గుర్రంకొండ మండలం, తరిగొండ పంచాయతీ, బురుజుపల్లికి చెందిన నాగమ్మ (90) ఒంటరి జీవితం గడుపుతోంది. ఈమెకు నా అన్నవారు ఎవరు లేరు. ఎప్పుడూ మదన పడుతూ ఉండేది. రెండు రోజులక్రితం మదనపల్లెలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చింది. తిరిగి బుధవారం తిరుగు ప్రయాణమై ఆటో ఎక్కింది. మార్గమధ్యంలోని పట్టణ శివార్లలో ఉన్న తట్టివారిపల్లి చెరువు వద్ద దిగింది. కొద్దిసేపు అటు ఇటు చూసి ఎవరు రాని సమయంలో నీళ్లలోకి దూకేసింది. ఇంతలో గమనించిన స్థానికులు ఆమెను బయటికి తీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బంధువులు అక్కడికి చేరుకుని బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

యువకుడు అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

శివ (ఫైల్ ఫొటో)

యువకుడు మిస్సింగ్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజ నేయులు తెలిపారు. మండలంలోని కోన పంచాయితీ గంగిరెడ్డిగారిపల్లెకు చెందిన సాంతాల వెంకటరమణ కుమారుడు సాంతాల శివ గత నెల 27వ తేదీన తప్పిపోయినట్లు తండ్రి వెంకటరమణ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శివ ఇంటిలో ఉండి పదే పదే సెల్ ఫోన్ చూస్తూ ఉండడం గమనించిన తండ్రి మందలించడంతో ఇంటి నుండి వెళ్లిపోయినట్లు తెలిపారని అన్నారు. కుమారుడు ఇంటిలో నుండి వెళ్ళినప్పటి నుండి స్థానిక బంధువుల ఇళ్లకు, ఊర్లలో వెతికినప్పటికీ ఫలితం లేకపోవ డంతో, ఈనెల ఆరవ తేదీన శివ తండ్రి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య ఆత్మహత్యకు కారకుడైన భర్త అరెస్టు

ప్రజాశక్తి-కలకడ

భార్య ఆత్మహత్యకు కారకుడైన భర్తను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లిలో శాంతల మనీ, భార్య చిన్నారిలు కలసి ఎర్రయ్య గారి పల్లికి చెందిన రెడ్డప్ప ఇంటిలో బాడుగకు నివాసం ఉంటున్నారని తెలిపారు. వీరిద్దరిలో చిన్నారి హైదరాబాదుకు చెందినది గాను, మనీ మహబూబ్ నగర్ కు చెందినవారుగా తెలిపారు. చిన్నారి అనాథ కావడంతో మనీ సంవత్సర క్రితం వివాహం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వివాహమైన అనంతరం వీరు జీవనోపాధి కోసమే ఎర్రయ్యగారిపల్లెలో అద్దె ఇంట్లో ఉన్నట్లు తెలిపారు. మనీ ప్రతిరోజు మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య చిన్నారిని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ భార్యాభర్తలు గొడవపడే వారిని తెలిపారు. ఆదివారం సాయంత్రం చిన్నారి భర్త మద్యం మత్తులో ఇంటికి రావడంతో భర్తను మందలించినట్లు తెలిపారు. భర్త మాటలకు విసుకు చెంది, జీవితంపై విరక్తి చెందిన చిన్నారి వారు నివాసం ఉంటున్న అద్దె ఇంట్లో ఉరేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. భార్య ఆత్మహత్యకు కారకుడైన మనీని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచినట్లు ఎస్ఐ తెలిపారు.

ముత్తూట్ ఫైనాన్స్ సిబ్బంది చేతివాటం

- 66 లక్షల స్వాహా : కేసు నమోదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండల కేంద్రం బి.కొత్తకోటలో ముత్తూట్ ఫైనాన్స్‌లో బంగారు నగలు విడిపించిడానికి వచ్చిన కస్టమర్ల నుంచిడబ్బు తీసుకొని సంస్థకు చెల్లించకుండా సొంత అవసరాలకు వాడుకొని సిబ్బంది చేతివాటం చూపించారు. బంగారు ఇవ్వకుండా కాలయాపన చేస్తుండడంతో రీజనల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లిన కస్టమర్లు. రీజనల్ మేనేజర్ ఫిర్యాదుతో బి.కొత్తకోటలోని ముతూట్ ఫైనాన్స్ సిబ్బంది ఇమ్రాన్‌బాషా, ఎం.హరికృష్ణ, హరీష్‌లపై కేసు నమోదు చేసినట్లు సిఐ జీవన్ గంగానాథ్ బాబు పేర్కొన్నారు.

పోక్సో కేసులో కర్ణాటక వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-కలికిరి : పోక్సో కేసులో కర్ణాటక వ్యక్తిని అరెస్టు చెసినట్లు సిఐ రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రంలోని హసన్‌కు చెందిన జెఎస్ రాకేష్ అలియాస్ సునీల్ అనే వ్యక్తి అక్కడే ఓ బాలికను ప్రేమించి ఆమెను గర్భవతిని చేసి మోసం చేశాడని తెలిపారు. అతనిపై పోక్సో కేసు నమోదు అయినట్లు ఆయన తెలిపారు. నిందితుడు కలికిరిలో ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న కర్ణాటక పోలీసులు కేసును కలికిరి పోలీస్ స్టేషన్ కు బదిలీ చేయగా నిందితుడు కలికిరి క్రాస్ రోడ్‌లో ఉన్నట్లు సమాచారం మేరకు కలికిరి పోలీస్ సిబ్బంది అరెస్టు చేసి వాల్మీకిపురం జెఎంసి కోర్టులో ప్రవేశపెట్టగా మేజిస్ట్రేట్ నిందితుడికి14 రోజుల రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.